క్లుప్తంగా

జామియా మసీదు ప్రారంభం



మసీదు ప్రారంభోత్సవంలో నాయకులు

కోసిగి: మండల పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన సున్నీ జామియా మసీద్ ప్రాంభోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం ముస్లింలు మత గురువు ఆధ్వర్యంలో మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. మజీద్ నిర్మాణానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి , ఆయన తనయుడు వై. ధరణీధర్ రెడ్డి సహకారంగా 200 సంచులు సిమెంట్ 10 క్వింటాళ్ల ఐరన్ కడ్డీలను విరాళంగా అందజేసినట్లు మసీదు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే తరుపున వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, గ్రామ నాయకుడు నరసింహులు గౌడ, వైస్ సర్పంచ్ బషీర్ అహ్మద్, ఫకృద్దీన్, రెహమాన్, నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

మంత్రాలయం రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ నూర్జహాన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాన్పుల వార్డు, ల్యాబ్ రూమ్, మెడిసిన్ రూములను పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు భారతి, గోవిందమ్మ, మాధవ స్వామి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పరుగు పందెంలో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పి. అశోక్‌నాయక్ తెలిపారు. సోమవారం జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఆదివారం తిరుపతిలో స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి 5 కిలో మీటర్ల పరుగు పందెంలో మోడల్ స్కూల్ చెందిన విద్యార్థులు కే. భాస్కర్, వి. వీరేష్, టి. దినేష్, ఎస్. శ్రీనివాసులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్, ప్రశంసా పత్రాలను అందుకున్నాన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్, షరీఫ్, ఉరుకుందప్ప, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ మార్గదర్శకులు



ఫిజికల్ డైరెక్టర్లను సత్కరిస్తున్న వాలీబాల్ అసోసియేషన్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులకు మంచి భవిష్యత్‌కు ఉపాధ్యాయులు మార్గదర్శకులు ఎమ్మిగనూరు వాలీబాల్ అసోసియేషన్ సీనియర్ క్రీడాకారులు బాబుఖాన్, విక్రమ్, గోవిందు, శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎమ్మిగనూరు వాలీబాల్ అసోసియేషన్ (వైవీఏ) ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 19 విభాగంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా ఎంపికైన కమ్మరి రాఘవేంద్రాచారి, ప్రకాశం జిల్లాకు ఉత్తమ పీడీలుగా ఎంపికైన పట్టణానికి చెందిన శ్రీనివాసులును సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు ప్రసాద్, పెద్దఈరన్న, సునీల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహం అడ్డగింత

ఆదోని అర్బన్: పట్టణంలోని ఇందిరానగర్‌లో బాల్యవివాహాన్ని టూటౌన్ పోలీసులు అడ్డగించారు. టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఇందిరానగర్‌లో బాల్యవివాహం చేస్తున్నారన్న సమాచారంతో ఆ ప్రాంతానికి వెళ్లి కుటుంబ సభ్యులకు బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. ఇరువురి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.



దుద్ది గ్రామంలో ప్రధాన రోడ్డులో సచివాలయం వద్ద గుంతలలో నిల్వ ఉన్న వర్షపు నీరు



పాఠశాల ఎదుట నిలిచిన వర్షపు నీరు

- వర్షాలకు గుంతల్లో నిలుస్తున్న నీరు
- ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

రోడ్లన్నీ గుంతలమయం

కోసిగి: మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన రోడ్లన్నీ గుంతమయంగా మారాయి. అటు ప్రజలు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కోసిగిలోని ప్రధాన రోడ్డు సబ్ రిజిస్ట్రార్, పంచాయతీ కార్యాలయం వద్ద కంకర తేలి గుంతలు పడ్డాయి. అలాగే మండలంలోని దొడ్డి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఎదుట, దుద్ది గ్రామంలో బస్టాండ్ నుంచి చిర్తనకల్లు రోడ్డులోని సచివాలయం వరకు కిలో మీటరు మేరకు గ్రామంలో గుంతలే దర్శనమిస్తాయి. ఆ ప్రాంతాలలో చినుకు పడితే చాలు గుంతలన్నీ జలమయమై వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా తయారవుతున్నాయి. ఆ గుంతల తప్పించే క్రమంలో పలు వాహనాలు గుంతలలో ఇరుక్కుపోయి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆయా గ్రామాల్లో విద్యార్థులు మురుగు నీటిలోనే నడిచి పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి. అలాగే అగసనూరు గ్రామంలో మూగలదొడ్డి పంప్‌హౌస్ వరకు రోడ్డు అంతట కంకర తేలింది. గుంతలను పూడ్చాలని ప్రజలు పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నందవరంలో గుంతల మయంగా ప్రధాన రహదారి

చిన్నపాటి వానలకే రోడ్లు ఛిద్రం

నందవరం : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను విస్మరించింది. చిన్నపాటి వర్షానికే ప్రధాన రోడ్లు దుర్భరంగా మారుతున్నాయి. గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. అయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మండలంలోని నాగలదిన్నె టూ ఎమ్మిగనూరు ప్రధాన రహదారి ఛిద్రమయ్యింది. నాగలదిన్నె నుంచి ముగతి వరకు 600 గుంతలు ఉన్నాయి. ఆ గుంతల్లో వాహనదారులు ప్రయాణించడానికి నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వానలకే రోడ్లు గుంతల మయంగా మారాయి. గుంతల్లో నీరు నిల్వ చేరడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదోనిని జిల్లా చేయాలి

ఆదోని అర్బన్: ఆదోని జిల్లాగా చేయాలని కోరుతూ సోమవారం ఆదోని డివిజన్‌లో ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మగ్దుంబాషా ఆధ్వర్యంలో జర్నలిస్టులు సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఆదోనికి జిల్లాగా ఏర్పాటైతే అభివృద్ధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అభివృద్ధి జరగాలంటే ఆదోని జిల్లా కోసం ఎమ్మెల్యే లు అసెంబ్లీలో ప్రతిపాదన పెట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థుల సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అందరూ కలిసి ఆదోని జిల్లా ఏర్పాటుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు బలరాంసింగ్, న రసప్ప,గౌస్, రవీంద్రగౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల

ఆదోని రూరల్: మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. సోమవారం ఆదోనిలో మహిళా సంఘం మహాసభలు జరిగాయి. ఆమె మాట్లాడుతూ మహిళలకు అన్నివిధాలా రక్షణ కల్పిస్తామని మాటలు చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. మహిళా సంఘం జిల్లా నాయకురాలు పి.ఎస్.సుజాతమ్మ, పాండవగల్లు సర్పంచ్ కె.ఉమాదేవి, మాజీ కౌన్సిలర్ ముత్తమ్మ, ఆర్ మక్బూల్‌బాను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి



ప్రజాసమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల వేగవంతంగా పరిష్కరించాలని, పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌పీఓ తిమ్మక్క, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభరెడ్డి, గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, గోనెగండ్ల మండల పార్టీ కన్వీనర్ కెవీ.కృష్ణారెడ్డి ఆరోపించారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను నేడు కూటమి ప్రభుత్వం రైతు బాధల కేంద్రాలుగా మార్చిందన్నారు. నాడు ఆయా కేంద్రాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను పూర్తి స్థాయిలో అందించారన్నారు. నేడు రూ.270లు వున్న యూరియా బస్తాను రూ.400 నుంచి రూ.450లకు విక్రయించుకుంటున్నా అరికట్టే నాథుడే లేడన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌ను అదుపు చేసే అధికారులు కూడా మౌనంగా వుంటున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటాపురం బోయబజారి, బి.అగ్రహారం రంగారెడ్డి, బనవాసి బసిరెడ్డి, నర్సన్నాచారి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థినులకు గాయాలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని మైనార్టీ కాలనీలో నివాసం ఉంటున్న అయ్యద్ బాషా, రిజ్వాన్ దంపతులు కుమార్తెలు ఖాదర్ బీ, ఫాతిమా బీలకు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బాలికలు కోసిగి బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. సాయంత్రం ఇంటి పై భాగంగా ఆడుకుంటుండగా.. కిందికి వేలాడుతున్న విద్యుత్ మెయిన్ తీగలు తగిలి షాక్‌కు గురై కుప్పకూలారు. ఇద్దరి చేతికి, శరీరంపై గాయాలతో బయట పడ్డారు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి.. మెరుగైన వైద్యం కోసం ఆదోనికి వెళ్లారు. మైనార్టీ కాలనీలో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్న విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపించారు.

5 లీటర్ల సారా పట్టివేత

ఆదోని అర్బన్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మారెమ్మ అనే మహిళ నాటుసారాను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆమె వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సాదాపురంలో చోరీ

ఆదోని రూరల్: మండలంలోని సాదాపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోరీ కలకలం రేపింది. గ్రామానికి చెందిన పుచ్చకాయల కాశన్న చెన్నైలో నివాసముంటున్నారు. ఆయన ఇంటికి ఉన్న తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి లోపలికి చొరబడి 24 తు లాల వెండి చైన్లు, కొద్దిపాటి బంగారం, వస్త్రా లు ఎత్తుకెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఆదోని తాలూకా పోలీసులు విచారణ చేపట్టారు.

యువకుడి అదృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎంఐజీ కాలనీకి చెందిన హరీఫ్‌ఖాన్ అనే యువకుడు మూడు రోజుల క్రితం అదృశ్యమయ్యాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. హరీఫ్‌ఖాన్ పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడని, గత మూడు రోజుల క్రితం పనికి వెళ్తున్నట్లు చెప్పి తిరిగి రాలేదని భార్య షాహీన్‌బాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పందుల అపహరణ

ఆదోని అర్బన్: పట్టణంలోని 40 పందులు ఈనెల 11వ తేదీన అపహరణకు గురైనట్లు టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎస్కేడీ కాలనీకి చెందిన సుంకన్న, అయ్యప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సుంకన్నకు చెందిన 20 పందులు, అయ్యప్పకు చెందిన 20 పందులు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారన్నారు. వీటి విలువ రూ.5.90 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

మెడికల్ కాలేజీ ప్రైవేటుకు అప్పగించొద్దు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని టౌన్: ఆదోని మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణ అధ్యక్షుడు బి.దేవా, మండల యూత్ అధ్యక్షుడు నల్లారెడ్డి, ఎమ్మిగనూరు జిల్లా యువజన ఉపాధ్యక్షులు నజీర్, మంత్రాలయం యువజనాధ్యక్షుడు రాజశేఖర్ తదితరులు డిమాండ్ చేశారు. ఆదోని మండలంలోని ఆరేకల్ సమీపంలో ఉన్న మెడికల్ కళాశాలను సోమవారం పరిశీలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వాటిలో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి నిర్మాణం చేసి పేదలకు అందించడం జరిగిందన్నారు. మిగిలిన 12 కాలేజీలను దాదాపుగా 60 శాతం పనులు పూర్తి చేశారన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆ నిర్మాణాలు అక్కడితో ఆగిపోయాయన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వాటి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందించాలన్నారు. పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సోమేశ్‌రెడ్డి, ఉరుకుంద, తిక్కరెడ్డి, హనుమేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గం

ఆదోని సెంట్రల్/రూరల్: ఆదోని మండలం అరెకల్లు గ్రామ సమీపంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమైనచర్య అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు విమర్శించారు. పట్టణంలోని ఎమ్మిగనూరు రహదారిలోని ఆదోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య విద్యతో పాటు వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ పనులను నిలిపివేయడమే కాకుండా పీపీపీ విధానంతో ప్రైవేట్ వాళ్లకు కట్టబెట్టేందుకు పూనుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. వైద్య కళాశాలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: అధిక వర్షాలు వల్ల పంట పొలాల్లో నీటి నిల్వ ఉంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో శివశంకర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని బనవాసి గ్రామంలోని ప్రత్తి, ఇతర పంట పొలాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ పత్తి పొలంలో ముంపు పరిస్థితి ఉన్నప్పుడు మురుగు నీటిని తొలగించడంతో పాటు ఎండగా ఉన్న సమయంలో పోటాషియం నైట్రేట్ 5 గ్రాములు ప్రతి లీటర్ నీటికి లేదా నానో యూరియా 2-4 మి.లీ ప్రతి లీటర్ నీటికి కలిపి వారం వ్యవధిలో మారు మారుగా పిచికారీ చేయాలన్నారు.

హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం

ఆదోని రూరల్: రాజ్యాంగ హక్కుల అమలు కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని, దేశ స్వాతంత్ర్యం సిద్ధించి 8 పదులకు దగ్గరవుతున్నా నేటికీ స్వాతంత్ర్య ఫలాలు దళితులకు దక్కడం లేదని కేవీపీఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆదోని పట్టణంలోని ఎన్జీఓ హోంలో కేవీపీఎస్ ఆదోని మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో 79 సంవత్సరాల స్వాతంత్ర్య దళితులు అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవసాయం, ఎండీ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

నందవరం : పొదుపు మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా వయోజన విద్య ప్రాజెక్టు ఆఫీసర్ ప్రతాప్, సూపర్‌వైజర్ నెమ్మలయ్య సూచించారు. సోమవారం స్థానిక శ్రీశక్తి భవనంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు వయోజన విద్యపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సందీప్, ఏపీఎం రాఘవేంద్ర, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలతో పాటు విద్యారంగ సమస్యలను సత్వరం ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రణభేరి ప్రచార యాత్ర సోమవారం పట్టణానికి చేరుకుంది. సోమప్ప సర్కిల్‌లో ప్రచార రణభేరిలో ఆయనతో పాటు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు లక్ష్మిరాజు, జయచంద్రరెడ్డి మాట్లాడారు.

ఎమ్మిగనూరుటౌన్: పాఠశాలల్లో భోదన సమయాన్ని హరిస్తున్న అసిస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని సత్వరం రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాటూర్ రవికుమార్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో విఫలమైన విద్యాశాఖ నిర్లక్ష్యాన్ని నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పట్టణంలోని గాంధీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్‌తో పాటు సోమప్ప సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా మాజీ అధ్యక్షుడు ఏపీ వీరన్న, రాష్ట్ర కౌన్సిలర్ పరశురాముడు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్ల సేవలు మరువలేనివి



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అవోపా, వామ్ సభ్యులు

ఆదోని అర్బన్: ఇంజినీర్ల సేవలు మరువలేనివని ఆదోని పట్టణ అవోపా మరియు వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా అన్నారు. ఆదోని పట్టణంలో ఆదోని ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా), ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) సంయుక్త ఆధ్వర్యంలో ఇంజినీర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మజ, సూపరింటెండెంట్ నాగలక్ష్మి, ప్రఖ్యాత సివిల్ ఇంజినీ ర్ శ్రీ జితేంద్రనాథ్ తివారీలను అవోపా, వామ్ సభ్యు లు సన్మానించారు. ఆదోని పట్టణ అవోపా మరియు వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, కార్యదర్శులు రఘు, సభ్యులు వెంకటేష్‌బాబు, పి.రఘు, అవోపా మహిళా విభాగ్ అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో....
స్థానిక లయన్స్ క్లబ్‌లో జాతీయ ఇంజినీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీర్లు హరిత, యశస్విని, లక్ష్మణ, అలేఖ్య, కిరణ్, నితిన్, మహంతేష్, అభియన్‌లను సన్మానించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, అధ్యక్ష కార్యదర్శులు ధర్మారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి కమిషనర్ గంగిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ డీఈలు నీరజ, రాజునాయక్, టీపీఓ రాజేష్, ఆర్ఓ అస్లాంబాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎద్దుల బలప్రదర్శన పోటీలు



వృషభాల యాజమానికి నగదును అందజేస్తున్న దృశ్యం

గోనెగండ్ల : చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి మహోత్సవాల సందర్భంగా ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో నాలుగు పళ్లు, ఆరు పళ్లు, న్యూ క్యాటగిరి వృషభాలు 46 జాతలు పాల్గొన్నాయి. న్యూ కేటగిరీ విభాగంలో ప్రకాశం జిల్లా మద్దిరాములు గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి వృషభాలు విజేతగా నిలిచాయి. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వృషభాల యాజమానికి మదీనా కంకర్ మిషన్ యాజమాని సుభాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్సూర్, కుమారస్వామి, అమరేశ్వరప్ప, ఇమ్రాన్‌లు ట్రాక్టర్ యూనియన్ నాయకులతో కలిసి రూ.50 వేల నగదును అందజేశారు. అలాగే రెండవ స్థానంలో గుంటూరు జిల్లా, చౌదరి బుల్స్ రూ.40వేలు, మూడవ స్థానంలో నాగర్ కర్నూలు జిల్లా, రాయవరం ఎద్దులు రూ.30వేలు, నాల్గవ స్థానంలో అనంతపురం జిల్లా, ఉబిచెర్ల వృషభాలు రూ.20వేలు, ఐదవ స్థానంలో గద్వాల జిల్లా, మేడికొండ ఎద్దులు రూ.10వేలు, ఆరవ స్థానంలో ఎమ్మిగనూరుకు చెందిన వృషభాల యాజమానికి రూ.5వేలు నగదును అందజేశారు.